క్లుప్తంగా

ఇంటింటి ప్రచారం

ఇల్లందురూరల్: మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్ నాయకులు మండలంలోని విజయలక్ష్మీనగర్‌లో మంగళవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పూనెం సురేందర్, పూనెం కవిత, సూర్నపాక సత్యనారాయణ, ఎట్టి హరికృష్ణ, ధనసరి రాజు శ్రీనివాస్, తాండ్ర లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'మద్దిశెట్టి'కి అవార్డులు



డాక్టర్ వెంకటేశ్వరరావు దంపతులకు అవార్డులు అందజేస్తున్న నిర్వాహకులు

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకు మరో రెండు అవార్డులు వరించాయి. ఈనెల 5న పెద్దపల్లి జిల్లా మంథని జానకి రామ కల్యాణ మండపంలో జరిగిన శ్రీ గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ 4వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయస్థాయి విశిష్ట ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. విద్యారంగంలో విశేష సేవలు అందించిన రిటైర్డ్ హెచ్‌ఎం డాక్టర్ వెంకటేశ్వరరావును అతిథులు, నిర్వాహకులు సన్మానించి ఉపాధ్యాయ శిరోమణి, జాతీయస్థాయి స్ఫూర్తిరత్న అవార్డులను అందజేశారు. ఈ విషయాన్ని మంగళవారం స్థానిక విలేకరులకు అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు 26 అవార్డులు, 11 గోల్డ్ మెడల్స్, ఐదు నంది అవార్డులు అందుకున్నట్లు వెంకటేశ్వరరావు చెప్పారు.

'విద్యాధన్'ను సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్, పాలిటెక్నిక్‌లలో మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందే విద్యార్థుల కొరకు సరోజిని దామోదర్ ఫౌండేషన్ వారు అందిస్తున్న విద్యాధన్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదో తరగతిలో 9 జీపీఏ సాధించి, సంవత్సర ఆదాయం రూ.2 లక్షలు కలిగిన వారు స్కాలర్‌షిప్‌లు పొందేందుకు అర్హులని తెలిపారు. విద్యార్థులు వారి పదో తరగతి మెమో, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్ ఫొటోతో వెబ్‌సైట్‌లో జూన్ 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హులైన వారికి జూలై 7న ఆన్‌లైన్‌లో స్క్రీనింగ్ టెస్ట్ జరుగుతుందని, మెరిట్ ప్రకారం ఎంపికైన విద్యార్థులకు ప్రతిఏటా రూ.10 వేల నుంచి రూ.60 వేల వరకు స్కాలర్‌షిప్‌లు అందుతాయని, అన్నివర్గాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిన్నారులకు బైబిల్ బోధన



బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

జూలూరుపాడు: జేపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూలూరుపాడు బిలీవర్స్ చర్చిలో చిన్నారులకు బైబిల్ వాక్య పాఠ్యాంశాన్ని మూడు రోజులు బోధించారు. ఈ సందర్భంగా దేవునిలో ఎదగాలని, చెడుమార్గాన్ని వదిలి మంచి మార్గంలో నడవాలని చిన్నారులకు నిర్వాహకులు బోధించారు. మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకుడు, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం చిన్నారులకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బిలీవర్స్ చర్చి పాస్టర్ ఎలీషా, బ్రదర్ మనోజ్, ఫౌండేషన్ నిర్వాహకులు ఇడుపుల రాజు, దుద్దుకూరి మధుసూదన్‌రావు, వేల్పుల నరసింహారావు, నున్నా రంగారావు, సాయిల కృష్ణయ్య, మాచినేని సత్యనారాయణ, పోతురాజు నాగరాజు, గోలి సెల్వరాజ్, మిర్యాల కిరణ్ కుమార్, చిన్నారులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పాల్వంచరూరల్: ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి కూలీలు ఉదయం 7గంటల లోపు పనులకు హాజరు కావాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి ఆదేశించారు. మండలంలోని పాండురంగాపురం తండా, తవిశలగూడెం, ఇల్లెందులపాడు తండా గ్రామపంచాయతీలో జరుగుతున్న చెక్‌డ్యామ్ పూడికతీత, కాలువల పూడికతీత, నర్సరీల పనులను మంగళవారం ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఉపాధి కూలీలు సకాలంలో పనులకు హాజరై మార్కింగ్ ప్రకారం రూ.300 వేతనం వచ్చే విధంగా పనులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పారండ్ల రంగా, ఈసీ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు విజయలక్ష్మి, కాళీ, సంధ్య, శ్రీను, చంటి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు విలవిల

- పనిప్రదేశంలో అరకొర టెంట్లు
- కనిపించని ప్రథమ చికిత్స కిట్లు
- పట్టించుకోని అధికారులు



పాండురంగాపురం పంచాయతీలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పాల్వంచరూరల్: మే నెలఖారులో వచ్చే రోహిణి కార్తె ముందే వచ్చిందా అన్నట్లు జిల్లాలో ఎండల తీవ్రత బాగా పెరిగిపోయింది. రాష్ట్రంలో భద్రాద్రి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఉదయం 8గంటల నుంచే ఎండ ప్రతాపం చూపుతోంది. మధ్యాహ్నం 1గంట తర్వాత వడగాల్పులు వీస్తున్నాయి. సాయంత్రం 5గంటల వరకు కూడా వేడి తగ్గడం లేదు. ఇలాంటి వాతావరణంలో కాసేపు ఎండలో ఉండాలంటేనే హడలిపోతాం. ఎడారి లాంటి ప్రాంతంలో ఉపాధి పనులకు వెళ్లిన కూలీల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలోనే పాల్వంచ మండలంలో వేసవి తీవ్రత అధికంగా ఉంటుంది. ఇలాంటి తరుణంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన సంబంధిత అధికారులపై ఉంది. అరకొర వసతులతో ఎండ తీవ్రతకు కూలీలు నిత్యం విలవిల్లాడుతున్నారు.

మండలంలో 11వేల జాబ్‌కార్డులు...

మండలంలోని 36 గ్రామపంచాయతీల్లో ఉపాధి కూలీలకు అధికారులు 11వేల జాబ్‌కార్డులు ఇవ్వగా 13వేలమంది కూలీలు పనులు చేస్తున్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని అధికారులు ఉపాధి పనులు చేసే కూలీలకు నీడనిచ్చే టెంట్లు అరకొరగా ఉంచడంతో అవి కూలీల సంఖ్యకు అనుగుణంగా సరిపోకపోవడంతో చెట్లకింద సేద తీరుతున్నారు. తాగునీరు కూడా సరిపోవడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనిప్రదేశంలో కూలీలు ప్రమాదవశాత్తు గాయపడినా, అస్వస్థతకు గురైనా వారికి వెంటనే ప్రథమ చికిత్స అందించే మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలి. కానీ ఎక్కడా కిట్లు కన్పించడం లేదు. మంగళవారం రెడ్డిగూడెం గ్రామంలో ఉపాధి కూలీ కలింగారెడ్డి మట్టి పనిచేస్తున్న క్రమంలో చేతికి గాయమైతే ప్రథమ చికిత్స కిట్టు అందుబాటులో లేక పాల్వంచలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించాల్సి వచ్చింది. ఎండలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు కూడ సరిపడా అందుబాటులో ఉంచడం లేదు. కూలీలకు తట్టలు, పార, పలుగులు కూడా ఇవ్వకపోవడంతో కూలీలే ఇంటివద్ద నుంచి తెచ్చుకుని పనులు చేసుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి.



ఎండకు చెట్ల నీడలో కూర్చున్న కూలీలు

కూలీల నుంచి డబ్బు వసూళ్లు?

ఉపాధి హామి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలందరికీ వందరోజులు పనిదినాలు కల్పించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న పనుల్లో అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడం వలన ఉపాధి సిబ్బంది కొంతమంది కూలీల వద్ద నుంచి మస్టర్లు వేసి వారానికోసారి అక్రమంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

టెంట్లు సరిపడా వేయాలి...



వేసవి తీవ్రత పెరిగిన దృష్ట్యా ప్రస్తుతం ఉపాధి కూలీలకు పనిప్రదేశంలో ఏర్పాటు చేసిన టెంట్లు సరిపోవడం లేదు. కూలీల సంఖ్యకు అనుగణంగా టెంట్లు ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది.

– బానోతు లీలా, ఉపాధి కూలీ

పలుగు, పారలు, తట్టలు ఇవ్వాలి..



ఉపాధి కూలీలకు పలుగు, పార, తట్టలను అందించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం ఉపాధి సామగ్రి అందజేయాలి. మెడికల్ కిట్లను కూడా అందుబాటులో ఉంచాలి.

– పార్వతి, ఉపాధి కూలీ

సౌకర్యాలు కల్పిస్తున్నాం..



ఎండ తీవ్రత దృష్ట్యా ఉపాధి పనుల వద్ద టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం. పలుగు, పార, తట్టలు ఇచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. పనుల వద్ద పర్యవేక్షణ చేస్తున్నాం.

– కె.విజయభాస్కరరెడ్డి, ఎంపీడీఓ, పాల్వంచ

బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న నామా, పక్కన మాజీ ఎమ్మెల్యే వనమా తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని ఖమ్మం లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. కొత్తగూడెంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన బూత్‌స్థాయి కమిటీల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నామా మాట్లాడుతూ.. అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న తనను మంచి మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు. అనంతరం వనమా మాట్లాడుతూ.. తనకు జరిగిన అన్యాయం నామాకు జరగకుండా చూడాలని కన్నీటి పర్యంతమయ్యారు.

సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకుందాం..

సింగరేణి(కొత్తగూడెం)/కొత్తగూడెంరూరల్: సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకోవాలంటే తనను గెలిపించాలని నామా నాగేశ్వరరావు కోరారు. సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని పలు గనుల వద్ద ఆయన వనమా రాఘవేందర్‌రావు, నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రచారం చేశారు. కార్మికుల ఇన్‌కమ్ ట్యాక్స్ రద్దు, ఇతర సమస్యల పరిష్కారానికి పాటుపడతానని తెలిపారు. ఇక లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రపురంలో వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి నామ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్, చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి, ఉప్పల వెంకటరమణ, కాపు కృష్ణ, కూసన వీరభద్రం, కొట్టి వెంకటేశ్వర్లు, మూర్తి, అన్వర్‌పాషా, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపు కోసం మంగళవారం మాచినేనిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో బీఆర్‌ఎస్ యూత్ నాయకులు గడగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి నామా నాగేశ్వరరావును భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.

మోదీని మూడోసారి ప్రధానిని చేద్దాం..

చుంచుపల్లి: బీజేపీ ఎంపీ అభ్యర్థులను గెలిపించుకుని నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిని చేసుకుందాం.. అని బీజేపీ చుంచుపల్లి మండల అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం అంబేద్కర్ నగర్‌లో నిర్వహించిన బీజేపీ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. భారతదేశం అభివృద్ధి కోసం, భావిభారత పౌరుల భవిష్యత్ కోసం భారతీయ జనతా పార్టీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మం సమగ్రాభివృద్ధికి పాటుపడే తాండ్ర వినోద్‌రావు ఒక విజన్‌తో ఈ ఎన్నికల బరిలో నిలిచారని అలాంటి వ్యక్తిని పార్లమెంట్‌కు పంపేందుకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం జీవీకే మనోహర్‌రావు మాట్లాడుతూ... భారతదేశంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు మోదీని మరోసారి ప్రధానిని చేస్తాయన్నారు. భవిష్యత్ తరాల అభివృద్ధి కొరకు కచ్చితంగా భారతీయ జనతా పార్టీని గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నరేంద్రబాబు, సుధాకర్, ఎం.శ్రీనివాస్, రాంబాబు, సాయిరాం, గ్రామస్తులు పాల్గొన్నారు.




చుంచుపల్లి: కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జీవీకే మనోహర్

జూలూరుపాడు: బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం భేతాళపాడు గ్రామ పంచాయతీలో బీజేపీ గిరిజన మోర్చా నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

భేతాళపాడు గ్రామ పంచాయతీ టాక్యాతండా, పంతులుతండా గ్రామాల్లో ఉపాధి పనుల వద్దకు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. భూక్యా రవి, భూక్యా రమేష్, ధరావత్ బాలకిషన్, సునావత్ పాండు, సుక్లియా తదితరులు పాల్గొన్నారు.

అటవీ సిబ్బంది వేధింపులు ఆపండి..



దామోదర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

పాల్వంచరూరల్: 12 ఏళ్ల క్రితం తెలంగాణనగర్‌లో నిరుపేదలు ఇంటి నిర్మాణం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ తరుణంలో అటవీ సిబ్బంది వచ్చి.. ఫారెస్టు పరిధిలో ఇళ్లు ఉన్నాయని వేధిస్తున్నారు.. అటవీ పరిధిలో తాము ఇళ్ల నిర్మాణం చేసుకోలేదని ఇబ్బందులకు గురిచేయవద్దని కోరుతూ తెలంగాణనగర్‌వాసులు మంగళవారం ఎఫ్‌డీఓ కట్టా దామోదర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బాధితులకు మాట్లాడుతూ.. 2011లో వికలాంగుల కాలనీని ఆనుకుని 817/1 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో 80 గజాల చొప్పున ఇళ్ల నిర్మాణం చేసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వ భూమిలో ఇళ్ల నిర్మాణం చేసినందుకుగాను రెవెన్యూ అధికారులు 2012లో కేసులు పెట్టారు. కోర్టును ఆశ్రయించి నగర్‌లో మౌలిక వసతులను కల్పించుకున్నట్లు చెప్పారు. అందరికీ విద్యుత్ మీటర్లు, ఇంటినంబర్లు కూడా మంజూరు చేశారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఫారెస్ట్ సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారు మాకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పానిశెట్టి వెంకటేశ్వర్లు, వెంకటరమణ, నాగలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్లే డే అలవెన్స్‌లు మంజూరు చేయండి

సింగరేణి(కొత్తగూడెం): ఎన్నికల విధి నిర్వహణకు వెళ్లిన సింగరేణి ఉద్యోగులను ఆన్‌డ్యూటీగా పరిగణించి ప్లేడే అలవెన్స్‌లు మంజూరు చేయాలని బీఎంఎస్ జాతీయ నాయకుడు పి.మాధవనాయక్ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 18వ పార్లమెంట్ ఎన్నికలు మే 13న నాలుగో విడత ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్లేడే, ఓడీ అలవెన్స్‌లు వర్తింపజేయాలని ఎలక్షన్ కమిషన్‌ను కోరినట్లు తెలిపారు.

మట్టి రవాణా అడ్డగింత

పాల్వంచ: స్థానిక పాత పాల్వంచ చింతల చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న లారీలను గోవర్ధనగిరి కాలనీవాసులు అడ్డుకున్నారు. నిత్యం లారీలో కాలనీ నుంచి తిరుగుతుండటంతో రోడ్డు మొత్తం కుంగిపోయిందన్నారు. చెరువు మట్టిని తోలే లారీలు గొల్లగూడెం నుంచి గానీ, పాత పాల్వంచ నుంచి గానీ, శివాలయం పక్కన రోడ్లలో తోలకుండా కాలనీలోని చిన్నపాటి సీసీ రోడ్డుపై నుంచి తోలడంతో భయభ్రాంతులకు గురవుతున్నట్లు చెప్పారు. తక్షణం అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలనీవాసులు రవీందర్‌రెడ్డి, ఎల్లావుల వెంకన్న, శంకర్, రాగ్యా, సందీప్ పాల్గొన్నారు.

ఉరుములు మెరుపులతో వర్షం

పాల్వంచరూరల్: మండలంలో మంగళవారం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండగా ఉన్న వాతావరణం ఒక్కసారి మారి హోరుగాలితో వాన కురిసింది. వేడిగా ఉన్న వాతవరణం ఒక్కసారిగా చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వర్షానికి తడవకుండా రైతులు పరదాలు కప్పి రక్షణ చర్యలు తీసుకున్నారు. వర్షం ఇలాగే కురిస్తే ధాన్యం తడిసిపోయే పరిస్థితి ఉంటుందని రైతులు అందోళన చెందుతున్నారు.

ప్రతీ హామీని అమలు చేస్తాం..

కొత్తగూడెంరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘురాంరెడ్డికి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎన్నికల కోఆర్డినేటర్ నాగా సీతారాములు అన్నారు. కొత్తగూడెం పట్టణంలోని పోస్టాఫీస్, మధువన్ హోటల్, గణేష్ టెంపుల్, పాల్వంచ తదితర ప్రాంతాలలో రఘురాంరెడ్డితో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ... పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అభివృద్ధి కన్నా అవినీతి ఎక్కువగా చేసిందన్నారు. అందుకే కారును షెడ్ పంపించారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చినా తీర్పు, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ హామిని అమలు చేస్తుందని చెప్పారు. ప్రచారంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, టీజేఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

కొత్తగూడెంఅర్బన్: మిత్రపక్షాలు బలపరిచిన ఖమ్మం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని మూడు, ఐదో వార్డుల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఊకంటి గోపాలరావు ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో పరమేష్‌యాదవ్, అనిల్, కే.వీరబాబు, ఆకునూరి కనకరాజు, కమర్, తాండ్ర నాగబాబు పాల్గొన్నారు.

వామపక్షాల ఆధ్వర్యంలో...

సింగరేణి(కొత్తగూడెం): సీపీఐ, సీపీఎం, టీజేఎస్, మద్దతునిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మంగళవారం కొత్తగూడెం మున్సిపాలిటీ రామవరంలోని ఏడు వార్డులలో వామపక్షాల నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. ఈ దేశంలో అవినీతి ఆగడాలు ఆగాలన్నా.. దేశ ఆర్థిక మూలాలను కాపాడాలన్నా, హస్తం గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి

జూలూరుపాడు: కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జూలూరుపాడు, గుండెపుడి, పాపకొల్లు, భేతాళపాడు, పడమటనర్సాపురం, కాకర్ల, వెంగన్నపాలెం, కరివారిగూడెం, కొమ్ముగూడెం, తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పోస్టర్లు అంటించి, ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేస్తూ హస్తం గుర్తుకు ఓటు వేసి, రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు.

పాల్వంచ: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ బేబీ శౌరి, రాష్ట్ర నాయకుడు ఎడవల్లి కృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక హెచ్ కన్వెన్షన్ హాల్‌లో మాజీ ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ముక్తేవి గిరీశ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ... ఎన్నికల్లో మతతత్వ పార్టీని ఓడించాలన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నూకల రంగారావు, గద్దం రాజ్‌కుమార్, అజ్మీర సురేశ్ నాయక్, అల్లాడి నరసింహారావు, ఎడారి ప్రదీప్‌కుమార్, అబీద్, భట్టు మురళీ, కట్ట సమ్మయ్య, తేజావత్ సాయి పాల్గొన్నారు.

ఇండియా కూటమికి మద్దతు

సింగరేణి(కొత్తగూడెం): పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద ఫాసిస్ట్ బీజేపీ మిత్రపక్షాలను ఓడించి, లౌకిక ప్రజాతంత్ర హక్కుల కోసం ఇండియా కూటమికి మద్దతు ఇవ్వాలని భారత కార్మిక సంఘాల సమైక్య (ఇఫ్టూ) జిల్లా సహాయ కార్యదర్శి గోపాలరావు, కోశాధికారి పి.సతీష్ పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తగూడెంలోని ఇల్లెందు గెస్ట్ హౌజ్ బంగ్లోస్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 13న జరగనున్న 18వ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో బీజేపీ దాని మిత్రపక్షాలు ఎన్డీఏ కూటమి నీతివంతమైన పాలన అందిస్తామని ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిందని, కానీ కార్పొరేట్ వర్గాల సేవలలో తరిస్తోందని, నూతన ఆర్థిక విధానాలను ప్రపంచీకరణ విధానాలను మరింత వేగవంతం చేసిందని, దేశభక్తి ముసుగు ధరించి ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. బీజేపీ చర్యలను వ్యతిరేకిస్తూ మేధావులు, విద్యావంతులు, ప్రతిపక్షాలు, వామపక్షాలు ఐక్యంగా ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజశేకర్, రోజా, లలిత, శారద, సురేష్, మల్లేశ్వరి, రాజు, శంకర్, రామకృష్ణ, రాజేష్, తార, అస్లీ, రాధ, రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడిస్తేనే దేశానికి మనుగడ



ప్రచారం చేస్తున్న నాయకులు

టేకులపల్లి: బీజేపీ అధికారంలోకి వచ్చాక అధిక ధరలు, ఆకలి, నిరుద్యోగం, అవినీతితో దేశాన్ని దివాలా తీయించారని, మోదీ విదేశాలకు వెళ్లే ఖర్చులతో రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించవచ్చని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు, పార్లమెంట్ ఎన్నికల టేకులపల్లి మండలం కన్వీనర్ భూక్యా హర్ష్య, ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు డి.ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం పార్లమెంట్ ఎన్నికల్లో న్యూడెమోక్రసీ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణ కుండ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ రెండు న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో టేకులపల్లి మండలం తొమ్మిదోమైలు తండా, బేతంపూడి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పని ప్రదేశాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కల్తీ వెంకటేశ్వర్లు, గుగుతోతు రామచందర్, బాలు, సజన్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందురూరల్: మహబూబాబాద్ ఎంపీ ఎన్నికల్లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణ కుండ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. మంగళవారం పోలారం పంచాయతీ బద్దుతండ, మర్రిగూడెం పంచాయతీ ఎల్లాపురం గ్రామాలాలో నిర్వహించిన ప్రచార గ్రూప్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. జడ సీతారామయ్య, కొక్కు సారంగపాణి, తోడేటి నాగేశ్వరరావు, చింత ఉదయ్, ఎట్టి నరసింహారావు, ముసలి సతీష్, వాంకుడోత్ సరోజిని పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పగటి కలలు కనొద్దు

టేకులపల్లి: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అధికారం అండతో అన్ని స్థానాలు గెలుస్తామనే కాంగ్రెస్ పార్టీ పగటి కలలను మానుకోవాలని, ఆ పార్టీ పట్ల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని బీఆర్‌ఎస్ మానుకోట ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత అన్నారు. ఈ మేరకు మంగళవారం దాసుతండాలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రతీఒక్కరు కారు గుర్తుపై ఓటు వేయాలని కోరారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. దేశంలో మతతత్వ పార్టీ బీజేపీ వల్ల కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ వల్ల కానీ తెలంగాణ అభివృద్ధి చెందదని, తెలంగాణ సాధకుడు, ఉద్యమ నేత, తెలంగాణ అభివృద్ధి ప్రదాత కేసీఆర్‌కే ఉందని పేర్కొన్నారు. కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో మానుకోట ఎంపీగా దీవించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, బొమ్మెర వరప్రసాద్, దిండిగల రాజేందర్, సురేందర్, లాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కవిత

గడువు సమీపించినా.. ప్రచారం అంతంతే

- అడ్రస్ లేని అభ్యర్థులు – మందగించిన ఇంటింటి ప్రచారం
- సభలు సమావేశాలకే పరిమితం – గడప తొక్కని నేతలు
- ఇల్లెందు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం తీరు ఇది



ఇల్లెందు: 18వ లోక్‌సభ ఎన్నికల గడువు ముంచుకొస్తోంది. కానీ అభ్యర్థులు వారి పార్టీలు ఇంటింటి ప్రచారం వెనుకబడింది. మరో మూడు రోజుల్లో ప్రచారం ముగించాలి. అధికార కాంగ్రెస్‌కు... ఇక్కడ ఎమ్మెల్యే కోరం కనకయ్య పితృవియోగం, అక్కడ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ మాతృవియోగంతో ప్రచారం నిలిచిపోయింది. దీనికి తోడు అటు సిట్టింగ్ ఎంపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోతు కవిత కూడా ఈ రెండు రోజులు అటు కనకయ్యను ఇటు బలరాం నాయక్‌లను పరామర్శించటంతో ఆమె ప్రచారం కూడా వెనకబడింది. ఇక బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ ప్రచారం కూడా నత్తనడకన సాగుతోంది. ఇదిలా ఉండగా ఆయా పార్టీలు ఇంటింటి ప్రచారంలో వెనకబడ్డాయి. గ్రామాలలో ఎన్నికల ప్రచారం జోరందుకోలేదు. కేవలం సభలు సమావేశాలు నిర్వహించి కార్యకర్తలను సిద్ధం చేస్తున్నారు. కానీ ఓటరు దగ్గరకు వెళ్లి ఇంటింటి ప్రచారం మందగించింది.

2009, 2014, 2019లో...

- 2009 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా పోరిక బలరాం నాయక్ ఎన్నిక కాగా, ఆనాటి ప్రత్యర్థి సీపీఐ అభ్యర్థి కుంజా శ్రీనివాసరావు ఓటమీ చెందారు. బలరాం నాయక్ మాత్రం 68, 957 మెజార్టీతో విజయం సాధించారు.
- 2014లో లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన అజ్మీర సీతారాంనాయక్ 3,20,569 ఓట్లు సాధించారు. ఆయన ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీకి చెందిన పోరిక బలరాం నాయక్‌కు 2,85,577 ఓట్లు వచ్చాయి. 34,992 ఓట్ల మెజార్టీతో సీతారాంనాయక్ విజయదుందుభి మోగించారు.
- 2019 లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ నుంచి మాలోతు కవిత విజయం సాధించారు. ఆమెకు 4,62,109 ఓట్లు లభించగా ప్రత్యర్థి కాంగ్రెస్‌కు చెందిన పోరిక బలరాం నాయక్‌కు 3,15,446 ఓట్లు వచ్చాయి. 1,46,663 ఓట్లతో కవిత విజయఢంకా మోగించింది. అయితే ముచ్చటగా మూడోసారి బలరాం నాయక్ తన భవితవ్యం తేల్చుకోబోతుండగా అజ్మీరా సీతారాం నాయక్ రెండోసారి, మాలోతు కవిత సిట్టింగ్ ఎంపీగా రెండోసారి తన బలం నిరూపించుకోబోతున్నారు.
- ఇదిలా ఉండగా 2019లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ నుంచి జాటోతు హుస్సేన్ నాయక్ పోటీ చేయగా 25,487 ఓట్లు మాత్రమే లభించాయి.
- ఇక ఎన్డీ ఉమ్మడి అభ్యర్థిగా మోకాళ్ల మురళీకృష్ణను ఈసారి కూడా బరిలో నిలుపుతుండగా 2019లో జరిగిన ఎన్నికల్లో 6,666 ఓట్లు మాత్రమే లభించాయి. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులలో ప్రజాధరణ ఎవరికి దక్కుతుందో పరీక్షించుకోబోతున్నారు.